22న హుండీ లెక్కింపు

ఇల్లంతకుంట, మార్చి 20: అనంతగిరి ముత్యాల పొచమ్మ ఆలయ హుండీలను ఈ నెల 22న లెక్కించనున్నట్లు ఆలయ అధికారి మారుతిరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహించే హుండీ లెక్కింపునకు గ్రామస్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ

ఎలారెడ్డిపేట, మార్చి 20: గొల్లపల్లిలో దుర్గామాత నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ ఆలయ కమిటీ సభ్యులు అందె బాలయ్య, అందె సురేశ్, అందె చంద్రం, బొల్లి లింగం తదితరులు ఉన్నారు.

విద్యార్థిని ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, మార్చి 20: ఆర్‌బీఐ నిర్వహించిన ఫైనాన్షియల్ లిటరసీ స్లోగన్ రైటింగ్ ఆన్‌లైన్ పోటీల్లో నారాయణపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గరిపల్లి ప్రణవి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని రూ.2వేలు అందుకున్నట్లు హెచ్ఎం చంద్రశేఖర్ తెలిపారు.

మనోహర్‌రెడ్డి పరామర్శ

వేములవాడ రూరల్, మార్చి 20: ఎదురుగట్ల గ్రామానికి చెందిన పొన్నం పరశురాములు ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నాయకులు ఏశ తిరుపతి, అంజిరెడ్డి, పొన్నం మహేశ్, మల్లయ్య, రాఘవరెడ్డి, స్వామి, రమేశ్, తదితరులు ఉన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ గుండెటి భారతి, W/o బాలయ్య, R/o. లక్ష్మిపూర్ గ్రామం, తంగళ్లపల్లి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన భాళీస్థలం దీని యొక్క ప్లాట్ నెంబర్ 121, దీని యొక్క విస్తీరం 200.00 చ.గజాలు, దీని యొక్క సర్వే నెంబరు 330/D, తంగళ్లపల్లి గ్రామం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనభాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 20-01-2024 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధార్థనగర్, సిరిసిల్ల, జి॥ రాజన్న సిరిసిల్ల.

CHANGE OF NAME

★I, POLASA MOUNIKA, D/o. Polasa Suresh, R/o. H.No. 6-32, Allipur, Raikal, Jagityal, TS. Changed after Marriage My Name as MYALAPU SANJANA, W/o. Myalapu Murali.
NT-328431

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

₹50వేలకు మించి తీసుకెళ్లొద్దు

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

కలెక్టరేట్, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సరైన ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ నగదును ఎవరైనా తీసుకెళ్తే సీజ్ చేయాలని అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్), ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్), వీఎస్‌టీ (వీడియో సర్వేలెన్స్ టీమ్)కు సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ సభ్యులు డబ్బులు, మద్యం, గిఫ్ట్ ప్యాక్‌లు సీజ్ చేసే క్రమంలో వీడియో తీయాలని సూచించారు. సీజ్ చేసిన వాటికి సంబంధించి రసీదు అందించాలని తెలిపారు. డబ్బు తీసుకెళ్లేవారు వాటికి సంబంధించి పత్రాలు, ఆధారాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అధికారులు బాధ్యతలు నిర్వర్తించాలని ఆదేశించారు. అనంతరం వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీలకు విధుల్లో భాగంగా చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. రూ.10వేలకంటే ఎక్కువ విలువైన వస్తువులు, సామగ్రి జీఎస్టీ బిల్లు లేకుండా తరలిస్తే సీజ్ చేయాలని తెలిపారు. అలాగే నోడల్ అధికారి రఫీ సీ విజిల్ యాప్ వినియోగం, ఫిర్యాదులు వస్తే ఎంత సమయంలోగా చేరుకోవాలి.. ఎన్ని నిమిషాల్లో పూర్తి చేయాలో వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీమ్ లక్ష్యం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ పోలీస్ సిబ్బంది

వేములవాడ, మార్చి 20: మహిళల రక్షణే షీ టీమ్ ప్రధాన లక్ష్యమని సిబ్బంది రమాదేవి, ప్రియాంక పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు షీ టీమ్ సేవలపై సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆకతాయిల వేధింపులకు గురిచేస్తే మహిళలు, యువతులు, బాలికలు వెంటనే షీ టీమ్‌ను సంప్రదించాలని తెలిపారు. అసాంఘిక ఘటనలను ఏ విధంగా ఎదుర్కోవాలి.. షీ టీమ్ సాయం పొందే విధానం గురించి వివరించారు. ఆపద సమయాల్లో డయల్ 100 నంబర్‌కి గానీ, షీ టీమ్‌కు సంబంధించిన వాట్సాప్ నంబర్ 8712656425కి గానీ, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇక్కడ హెచ్ఎం ఉమా బాలచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

ప్రేరణ పోటీలకు ఎంపిక

పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వేములవాడ రూరల్, మార్చి 20: వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రేరణ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడానికి తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే ప్రేరణ పోటీలకు అగ్రహారం డిగ్రీ కళాశాల విద్యార్థినులు భాగ్యలక్ష్మి, శ్రావణి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కామర్స్ విభాగాధిపతి మల్లారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు అఫ్సా రీఉస్మానీ, రాజేశ్, ప్రభాకర్, శ్రీనివాసులు, కరుణ, అంజాద్‌ఆలీ, నారాయణ, నర్సయ్య, మధుబాబు సన్మానించారు.

గంభీరావుపేట: ఎంపీపీ కూతురు నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, నాయకులు

రుద్రంగి: వివాహ వేడుకకు హాజరైన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాయకులు

శుభకార్యాలకు హాజరు

గంభీరావుపేట, మార్చి 20: కొత్తపల్లిలో ఎంపీపీ వంగ కరుణ కూతురు వివాహ నిశ్చితార్థ కార్యక్రమానికి నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు బుధవారం హాజరయ్యారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, లింగన్నగారి దయాకర్ రావు, గంధ్యాడపు రాజు, నర్సింహులు, సంజీవ్, సేనారెడ్డి, రాజయ్య ఉన్నారు.

వివాహ వేడుకకు హాజరైన విప్

రుద్రంగి, మార్చి 20: మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో బుధవారం లక్ష్మీనరసింహ–సంధ్య వివాహ వేడుకకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జడ్పీటీసీ గట్ల మీనయ్య, సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి వేర్వేరుగా హాజరై నూతన వధూరులను ఆశీర్వదించారు. ఇక్కడ నాయకులు తర్రె మనోహర్, మాడిశెట్టి ఆనం దం, గోళ్లెం నర్సింగ్, కొడగంటి శ్యామ్, చెలుకల తిరుపతి, అభిలాష్, నారాయణ ఉన్నారు.

పుస్తెమట్టెలు అందజేత

సిరిసిల్ల రూరల్, మార్చి 20: తంగళ్లపల్లి మండలం బాలమల్లుపల్లె పరిధిలోని ఎడ్లవానికుంటకు చెందిన రాధారపు కవిత కూతురుకి పుస్తెమట్టెలు అందజేసినట్లు కరీంనగర్ డెయిరీ సూపర్‌వైజర్ అనంతరెడ్డి తెలిపారు. కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తెమట్టెలు అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కస్తూరి తిరుపతిరెడ్డి, పాలడెయిరీ అధ్యక్షుడు రాజేశం, తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, మార్చి 20: రాజన్నపేటకు చెందిన కట్లె పరశురాములు–కనకవ్వ దంపతుల కూతురు పూజ వివాహం సందర్భంగా పాల ఉత్పత్తిదారుల సంస్థ నుంచి పుస్తె మట్టెలను బుధవారం అందించారు. ఇక్కడ పీఏసీఎస్ డైరెక్టర్ గోగూరి చంద్రారెడ్డి ఉన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దు

- ఆర్డీవో రాజేశ్వర్
- కొదురుపాక చెక్‌పోస్టు తనిఖీ

మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

బోయినపల్లి, మార్చి20: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని ఆర్డీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కొదురుపాక చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి, మాట్లాడారు. చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి, వివరాలు నమోదు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం అధికారులందరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే రెవెన్యూ పనులను చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ పుష్పలత, పోలీసులు, తదితరులు ఉన్నారు.

చందుర్తిలో వాహనాల తనిఖీ

చందుర్తి, మార్చి20: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం ఇత రత్రా తరలించే వారిపై నిఘాను పెంచారు. ఈ క్రమంలో బుధవారం మండల కేంద్రంలో వేములవాడ–కోరుట్ల రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు.

పరిశుభ్రతపై అవగాహన ఉండాలి

భూక్యారెడ్డితండాలో చిన్నారులతో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ సంతోష

కోనరావుపేట, మార్చి 20: చిన్నారులు పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ టీచర్ లక్కం సంతోష పేర్కొన్నారు. బుధవారం భూక్యారెడ్డితండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్‌లో భాగంగా చేతుల శుభ్రతపై చిన్నారులకు అవగాహన కల్పించారు. అన్నం తినే ముందు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఇక్కడ సిబ్బంది, చిన్నారులు, తల్లులు తదితరులు ఉన్నారు.

ఒంటరితనం భరించలేక
యువకుడి ఆత్మహత్య

మల్యాల, మార్చి 20: భార్యతో విడిపోయిన అనంతరం ఒంటరితనం భరించలేక మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నూకపల్లిలో బుధవారం జరిగింది. మల్యాల ఏఎస్ఐ రుద్ర కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సైదల వంశీ(23)కి ఒగులాపూర్‌కు చెందిన ఓ యువతితో రెండేండ్ల క్రితం వివాహం జరిగింది. కాగా, ఏడాదిక్రితం మనస్పర్థలతో విడిపోయారు. దీంతో వంశీ ఒంటరితనం భరించలేక, మనస్తాపంతో బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. బాధితుడి తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కృష్ణకుమార్ తెలిపారు.

జీవాలకు టీకాలు

ఇల్లంతకుంట, మార్చి 20: పత్తికుంటపల్లిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని పశు వైద్యాధికారి సతీశ్ పేర్కొన్నారు. గ్రామంలో దాదాపు 45పశువులకు టీకాలు వేశామన్నారు. రైతులు తప్పనిసరిగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. ఇక్కడ వైద్య సిబ్బంది శ్రీనివాస్, రాజయ్య, రైతులు ఉన్నారు.

జిల్లెల్ల చెక్ పోస్టులో ₹80,400 పట్టివేత

జిల్లెల్ల చెక్‌పోస్టులో సీజ్ చేసిన నగదును చూపిస్తున్న పోలీసులు ,అధికారులు

సిరిసిల్ల రూరల్, మార్చి 20: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని చెక్‌పోస్టులో బుధవారం ఎన్నికల అధికారులు ₹80,400 నగదు పట్టుకున్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన రాయికంటి వేణు తన కారులో మధ్యాహ్నం కొమురవెల్లి నుంచి వేములవాడకు వెళ్తుండగా, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల చెక్ పోస్టులో వాహన తనిఖీలు నిర్వహించారు. తనీఖీలో ₹80,400 లభ్యమవ్వగా, సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారులు, పోలీసులు అధికారు లు తెలిపారు. నగదును ఎస్‌టీ టీం సభ్యులకు అందజేసినట్లు వారు తెలిపారు.

తంగళ్లపల్లిలో బైక్ దొంగ రిమాండ్

సిరిసిల్ల రూరల్, మార్చి 20: తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లో సమ్మక్క సారలమ్మ జాతరలో బైక్‌ను అపహరించిన దొంగను పట్టుకుని, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. సిరిసిల్లలోని ఇందిరానగర్‌కు చెందిన పెంట శ్రీనివాస్ తన బైక్‌పై సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చాడు. వాహనాన్ని పార్కింగ్ చేసి రాత్రి పూట నిద్రిస్తున్న సమయంలో దుండగులు బైక్‌ను దొంగలించారని ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు విచారణ చేపట్టారు. బుధవారం వాహన తనీఖీల్లో బైక్, బైక్‌ను దొంగతనం చేసిన మండెపల్లికి చెందిన అల్లెపు నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

అపరిచితులుంటే
సమాచారం ఇవ్వాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 20: అపరిచితులు గ్రామంలో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం బండలింగంపల్లిలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇంటికి తాళంవేసి పొరుగూరికి వెళ్లినప్పుడు స్థానికులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానం ఉంటే పోలీసులకు సైతం సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలు తగ్గుతాయని సూచించారు. సోషల్‌మీడియాతో కలిగే అనర్థాలు వాటి వల్ల ఇబ్బందులెదురైతే తీసుకుంటున్న చర్యలపై వివరించారు. షీ టీం ప్రయోజనాలు, గ్రామంలో జరిగే చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఇక్కడ ఎస్ఐ రమాకాంత్, తదితరులు ఉన్నారు.

సిరిసిల్ల పట్టణంలోని విమల్ థియేటర్‌లో మాట్లాడుతున్న నటి ఇంద్రజ, పక్కన రజాకార్ చిత్ర యూనిట్ బృందం సభ్యులు

'రజాకార్' బృందం సందడి

జిల్లా కేంద్రంలో రజాకార్ సినిమా చిత్ర యూనిట్ బృందం సభ్యులు బుధవారం సందడి చేశారు. ముందుగా పట్టణంలోని బతుకమ్మఘాట్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి నటి ఇంద్రజ, డైరెక్టర్, బృందం సభ్యులు పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విమల్ థియేటర్‌లో ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ సినిమా చూడాలని కోరారు. చిత్ర యూనిట్ బృందం సభ్యులను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. – తెలంగాణ చౌక్, మార్చి 20

కాంగ్రెస్‌వన్నీ మోసపూరిత హామీలే..

- ఈ సీజన్‌లో రైతులకు సంబంధించి ఒక్క పథకమైనా అమలు చేశారా..?
- వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ • దెబ్బతిన్న పంటల పరిశీలన

గంభీరావుపేట: మండల కేంద్రంలో వడగండ్ల వానకు దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్

గంభీరావుపేట/ముస్తాబాద్, మార్చి 20: 'కాంగ్రెస్ ఎన్నికల ముందు రైతులకు అనేక హామీలు ఇచ్చింది. రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని చెప్పింది. పంటల పెట్టుబడికి ఎకరాకు ₹15వేలు, రుణమాఫీ ₹2లక్షలు, కౌలు రైతుకు ₹12వేలు, ధాన్యం క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తామని చెప్పింది. కానీ ఈ సీజన్‌లో ఏ ఒక్కటైనా అమలు చేశారా..? కాంగ్రెస్‌వన్నీ అబద్ధాలే' అని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కాంగ్రెస్‌పై నమ్మకంతో మెజార్టీ రైతులు అప్పులు తెచ్చి పంటలు సాగు చేశారని, కానీ పంట చేతికివచ్చే వరకు అకాల వర్షాలతో నష్టపోయారని, ఆ రైతు భరోసా పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గంభీరావుపేట, ముస్తాబాద్ మండల కేంద్రాలతో పాటు పోతుగల్, గన్నెవాల్లిపల్లె, తెర్లుమద్ది గ్రామాల్లో మూడు రోజుల క్రితం వడగండ్లు, ఈదురు గాలులతో నష్టపోయిన పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ముస్తాబాద్‌లో ఇటీవల మృతిచెందిన ఎల్సాని ఎల్లయ్య కుటుంబానికి ₹50వేల ఆర్థిక సాయం అందించారు. వడగండ్లతో తీవ్రంగా పంట నష్టపోయామని, అప్పులు తెచ్చిపెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోగా, ఎంపీ సంజయ్ స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేసి నష్టపోయిన రైతుల పంటల వివరాలను సేకరించాలని, తక్షణ సాయంగా ఎకరాకు ₹20వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే అమల్లోకి తేవాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గంట అశోక్, ఎంపీటీసీ సభ్యుడు కోటయ్యగారి రాజేందర్‌రెడ్డి, నాయకులు రాణిరుద్రమదేవి, కొక్కు దేవేందర్‌యాదవ్, రెడ్డబోయిన గోపి, ప్రసాద్‌రెడ్డి, పత్తి స్వామి, దేవసాని కృష్ణ, రాజుగౌడ్, లక్ష్మణ్, రాజిరెడ్డి, దేవేందర్, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో పూజలు

సిరిసిల్ల రూరల్, మార్చి 20: మండెపల్లిలోని ప్రభుత్వ వయోవృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులు బుధవారం కొండగట్టు ఆంజనేయ స్వామివారిని దర్శించుకున్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలతో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం సహకారంతో ప్రత్యేక వాహనంలో వయోవృద్ధులను ఆలయానికి తీసుకెళ్లగా, వారు స్వామివారిని దర్శించుకుని మొక్కు లు చెల్లించుకున్నారు. అనంతరం వన భోజనాలు చేశారు. ఇక్కడ ఆశ్రమ కోఆర్డినేటర్ మమత, అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఇల్లంతకుంట: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న వెంకటరాంబాబు

ఇల్లంతకుంట/వేములవాడ రూరల్, మార్చి 20: 18ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం అధికారి వెంకటరాంబాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన ఇల్లంతకుంటతోపాటు వేములవాడ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజగోపాల్ ఆధ్యక్షతన నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ సెంటర్ నిర్వాహకులు అనిల్‌రెడ్డి, మురళి, జ్యోత్స్న, కావ్య, రజిని, రమ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆరంభం

- ధర్మపురి నృసింహుడి బ్రహ్మోత్సవాలు మొదలు
- తరలివచ్చిన భక్తజనం

కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న డీసీఎమ్మెస్ చైర్మన్

ధర్మపురి, మార్చి20: ధర్మపురి క్షేత్రం పులకించింది. లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవ వేడుక వైభవంగా మొదలైంది. వేడుకల్లో భాగంగా తొలిరోజు బుధవారం ఈవో శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు జక్కు రవీందర్‌తో కలిసి మేళాతాళాలతో యజ్ఞాచార్యులు, పండితులు, అర్చకుల వద్దకు వెళ్లి దీక్షా వస్త్రాలు సమర్పించి ఉత్సవాలకు ఆహ్వానించా రు. అనంతరం ఆలయంలో యజ్ఞాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి ఘట్టమైన పుట్టబంగారం పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. చింతామణి చెరువు సమీపంలోని పుట్టబంగారం మండపానికి తీసుకువచ్చారు. ఉత్సవమూర్తులను మండపంలో ఉంచి యాజ్ఞాచార్యులు కందాళై పురుషోత్తమాచార్యుల మంత్రోచ్చరణల మధ్య ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పుట్టబంగారాన్ని తవ్వగా భక్తులు భక్తిశ్రద్ధలతో సేకరించారు. సేకరించిన పుట్టబంగారాన్ని పంట పొలాల్లో చల్లుకుంటే పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తుల నమ్మకం. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తగా, వేసవి దృష్ట్యా అధికారులు చలువపందిళ్లు వేశారు. గురువారం సాయంత్రం 6గంటలకు గోధూళి సుముహూర్తాన స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనుండగా, డీసీఎమ్మెస్ చైర్మన్ డాఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు.